సాక్షి
నంద్యాల
మంగళవారం ၊ 20 ၊ జూన్ ၊ 2023



ఉరుకుందలో భక్తుల రద్దీ

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించారు.



అలరించిన కథక్ నృత్యం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ దక్షిణమాడ వీధిలోని నిత్యకళావేదికపై సోమవారం ఏలూరుకు చెందిన బి.సత్యలక్ష్మీకుమారి చేసిన కథక్ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.

మహానందీశ్వరుడికి అభిషేకం



మహానంది: ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం మహానందీశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముందుగా స్వామిని అలంకరించారు.

న్యూస్‌రీల్

24వరకు ఒంటిపూట బడులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఈనెల 24వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వుల మేరకు వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఒంటిపూట బడులను మరో వారం రోజులు పొడిగించామన్నారు. ఉదయం 7.30 నుంచి 11.30గంటల వరకు పాఠశాలలు పని చేస్తాయని, ఉదయం 8.30 నుంచి 9గంటల వరకు రాగిజావ, మధ్యాహ్నం 11.30 నుంచి 12గంటల వరకు మధ్యాహ్న భోజనం అందించాలని డీఈఓ అన్నిపాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ



స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవ నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేద మంత్రోచ్చారణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ నిర్వహించారు.

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



ఎస్పీకి సమస్య విన్నవిస్తున్న వృద్ధురాలు

నంద్యాలటౌన్: పోలీసు స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపుతున్నట్లు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఎస్పీ వినతులు స్వీకరించి మాట్లాడారు. 115 ఫిర్యాదులు అందాయని, వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. పోలీసు అధికారులు ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. పరిష్కారానికి తీసుకున్న చర్యల గురించి ఎప్పటికప్పుడు జిల్లా కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. ప్రతి సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్లు, సర్కిల్ ఆఫీసులు, డీఎస్పీ ఆఫీసుల్లో స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వెంకటరాముడు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, సీఐ దస్తగిరి ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాయలసీమలోకి రుతుపవనాలు

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాల సీజన్ ప్రారంభం కానుంది. జూన్ 1 నుంచే ఖరీఫ్ మొదలైనప్పటికీ ఇంతవరకు ఆశాజనకంగా వర్షాలు పడలేదు. ఈ కారణంగా ఖరీఫ్ పంటల సాగు ముందుకు సాగలేదు. ఎట్టకేలకు నైరుతి రుతుపవనాలు రాయలసీమ జిల్లాల్లోకి ప్రవేశించాయి. ఈ ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఏర్పడింది. ఇప్పటికే తమిళనాడులో భారీ నుంచి కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ ప్రభావం రాయలసీమ జిల్లాలపైనా ఉండనుంది. ఈనెల 20, 21 తేదీల్లో కర్నూలు,నంద్యాల జిల్లాల్లోని అన్ని మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది.

బండిఆత్మకూరులో 66.4 మి.మీ వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. బండిఆత్మకూరులో అత్యధికంగా 66.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కర్నూలు జిల్లాలోని ఆరు మండలాల్లో తేలికపాటి వర్షాలు కురవగా.. మంత్రాలయంలో 8.2 మి.మీ వర్షపాతం కురిసింది. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. నంద్యాల జిల్లాలోని 12 మండలాల్లో వర్షాలు కురిశాయి. వెలుగోడులో 11.8, ఉయ్యాలవాడలో 9.2, నంద్యాలలో 9.0, కొలిమిగుండ్లలో 7.0, చాగలమర్రిలో 6.2 మి.మీ ప్రకారం వర్షపాతం నమోదైంది. కర్నూలు జిల్లాలో జూన్ నెల సాధారణ వర్షపాతం 77.1 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 30.2 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. నంద్యాల జిల్లాలో జూన్ నెల సాధారణ వర్షపాతం 76.8 మి.మీ ఉండగా 18.5 మి.మీలకే పరిమితమైంది.

సేవాలయాలు.. రైతుభరోసా కేంద్రాలు



డోన్ మండలం కొత్తపల్లిలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

విత్తనాలు.. రసాయన ఎరువులు.. ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు కోసం గతంలో మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. వ్యయప్రయాసలు తప్ప ఆశించిన ప్రయోజనం లభించేది కాదు. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగలేక రైతులు ఈ అవస్థలు ఇంకెన్నాళ్లు అంటూ పెదవి విరిచేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వీరి కష్టాలన్నీ తీరాయి. గ్రామస్థాయిలోనే వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన సేవలన్నీ అందుతున్నాయి. అన్నదాతలకు అన్ని రకాలుగా అండగా నిలుస్తూ రైతు భరోసా కేంద్రాలు సేవాలయాలుగా నిలిచాయి.

- గ్రామస్థాయిలోనే రైతులకు అన్ని రకాల సేవలు
- విత్తు నుంచి విక్రయం వరకూ ఆర్‌బీకేల ద్వారానే..
- గతేడాది 1.60 లక్షల టన్నుల ఎరువులు పంపిణీ
- కొత్తపల్లి ఆర్‌బీకేకు ఐఎస్‌ఓ గుర్తింపు

కర్నూలు(అగ్రికల్చర్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దూరదృష్టితో నెలకొల్పిన రైతుభరోసా కేంద్రాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఇవి 2020 మే నెల 30వ తేదీన ప్రారంభమయ్యాయి. వ్యవసాయ శాఖకు సంబంధించిన సేవలే కాకుండా ఉద్యాన శాఖ, ఏపీఎంఐపీ, పశుసంవర్ధక, మత్స్య, పట్టుపరిశ్రమ, మార్కెటింగ్ శాఖల సేవలన్నీ గ్రామస్థాయిలోనే అందిస్తున్నాయి. దీంతో అన్నదాతలకు సమయం, డబ్బులు ఆదా కావడంతో పాటు మండల కేంద్రాలకు వెళ్లే శ్రమ తప్పింది. ఉమ్మడి జిల్లాలో 877 ఆర్‌బీకేలు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 849, అర్బన్ ప్రాంతాల్లో 28 ఉన్నాయి.

అందుబాటులో అన్ని సేవలు

వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి ఉత్పాదకతను పెంచడం, ఇందుకు అవసరమైన అన్ని రకాల ఇన్‌పుట్స్.. అంటే విత్తనం మొదలు పండించిన పంటను మద్దతు ధరతో అమ్ముకునే వరకు ఆర్‌బీకేలు రైతులకు అండగా నిలుస్తున్నాయి. ఆర్‌బీకేల్లో వ్యవసాయ విజ్ఞానానికి సంబంధించిన దాదాపు 50 పుస్తకాలతో మినీ లైబ్రరీలు ఏర్పాటయ్యాయి. ఆర్‌బీకేల్లోనే రైతుల సందేహాలను నివృత్తి చేస్తారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తారు. ఘన, ద్రవ జీవామృతం, కషాయాల తయారీ తదితర వాటిపై రైతులకు శిక్షణ ఇస్తారు. ఆడియో, వీడియోల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. డిజిటల్ క్లియోస్క్‌ల ద్వారా అవసరమైన వాటిని ఆర్డర్ పెడితే చాలు.. ఇంటి ముంగిటకు వచ్చినట్లే. అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా డోన్ మండలం కొత్తపల్లి ఆర్‌బీకేకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ గుర్తింపు(సర్టిఫికెట్) కూడా లభించడం విశేషం.

> **గతంలో ఇలా..**
>
> టీడీపీ హయాంలో సబ్సిడీపై పంపిణీ చేసే అరకొర విత్తనాల కోసం మండల, నియోజకవర్గాల కేంద్రాల్లో రైతులు పడిగాపులు కాసేవాళ్లు. ఒక బస్తా ఎరువు అవసరమొచ్చినా పరుగెత్తాల్సి వచ్చేది. ఇన్‌పుట్ సబ్సిడీ కోసం కార్యాలయాలు చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కరుణ ఉండేది కాదు. పంటను మద్దతు ధరతో అమ్ముకునేందుకు ఎన్నో ప్రయాసలు ఎదుర్కోవాల్సి వచ్చేది.



ఎరువుల కోసం ఆర్‌బీకేలోని డిజిటల్ క్లియోస్క్ ద్వారా ఆర్డర్ పెడుతున్న దృశ్యం

అక్రమాలకు చెక్

గతంలో ప్రయివేటు డీలర్లు రసాయన ఎరువులను అడ్డగోలుగా అధిక ధరలకు విక్రయించే వారు. ఎంఆర్‌పీపై రూ.50 నుంచి రూ.100 వరకు ఎక్కువ వసూలు చేసేవారు. ఆర్‌బీకేలు ఏర్పాటు అయిన తర్వాత ప్రయివేటు డీలర్ల అక్రమాలకు చెక్ పడింది. గత ఏడాది వ్యవసాయ సీజన్‌లో రైతుభరోసా కేంద్రాల ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1.60 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు నిర్దిష్టమైన ధరకే అందజేశారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ, కంపోస్ట్ ఎరువులు తదితరవన్నీ రైతుభరోసా కేంద్రాల్లోని లభిస్తున్నాయి. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు తదితర వాటి కోసం ఆర్‌బీకేల్లోని డిజిటల్ క్లియోస్క్‌ల ద్వారా బుక్ చేసుకుంటే చాలు.. సేవలు అందినట్లే. ఈ సారి ప్రభుత్వం నానో లిక్విడ్ (ద్రవ రూప) యూరియా, నానో డీఏపీలను అందుబాటులోకి తెచ్చింది. నానో ద్రవరూప ఎరువులు కూడా ఆర్‌బీకేల్లో అందుతుండటం విశేషం. ఆర్‌బీకేల ద్వారా అన్ని రకాల పురుగుమందులు కూడా కచ్చితమైన ధరలకే లభిస్తున్నాయి.

పొలంబడి.. నూతన ఒరవడి

పంటల సాగులో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఆర్‌బీకేల వారీగా పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 855 పొలంబడి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆర్‌బీకే ఇన్‌చార్జిలే పొలంబడి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. వేరుశనగ, వరి, మినుము, మొక్కజొన్న, కంది,చిరుధాన్యాలు తదితర పంటల్లో పొలంబడి కార్యక్రమం జరుగుతోంది.

ఆర్‌బీకేలతో ఉపయోగాలు ఇవీ..

- సబ్సిడీపై పంపిణీ చేసే విత్తనాలతో పాటు నాన్ సబ్సిడీ విత్తనాలు కూడా ఆర్బీకేల ద్వారా రైతులకు అందుబాటులోకి వచ్చాయి.
- ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నాణ్యతా ప్రమాణాలను ముందుగా శాస్త్రీయంగా పరీక్షించిన తర్వాతనే రైతులకు పంపిణీ చేస్తున్నారు.
- ఈ–క్రాప్ నమోదు ద్వారా రూపాయి ఖర్చు లేకుండా రైతులు బీమా సదుపాయం పొందుతున్నారు.
- అధిక వర్షాలు పడి పంటలు దెబ్బతింటే ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఆర్‌బీకేల ద్వారానే ఎన్యూమరేషన్ చేస్తారు.
- సూక్ష్మ సేద్యం కోసం ఆర్‌బీకేల్లోనే పేర్లు నమోదు చేసుకోవచ్చు.
- మద్దతు ధర పొందడానికి ఆర్‌బీకేలే ఆధారం.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుతో మాకు అన్ని రకాల సేవలు గ్రామ స్థాయిలోనే అందుతున్నాయి. ఆర్‌బీకే ఇన్‌చార్జి మిత్రుడిలాగా అన్ని విషయాల్లో అండగా నిలుస్తున్నారు. ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు పొందుతున్నాం. ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు కూడా అందుబాటులో ఉంచారు. వ్యవసాయ అధికారులు మా పొలంలో వేసిన పంటలను పరిశీలించి ఈ–క్రాప్‌లో నమోదు చేశారు. గతంలో ఏ చిన్న అవసరమొచ్చినా గోనెగండ్ల, ఎమ్మిగనూరు, కోడుమూరుకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ కష్టాలన్నీ తొలగిపోయాయి. ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి అన్ని రకాల సేవలను అందుబాటులోకి తెచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– సోమేష్, కలుమూల, గోనెగండ్ల మండలం

ఇబ్బందులు తొలగిపోయాయి



మాకు 4.5 ఎకరాల భూమి ఉంది. గతంలో సబ్సిడీపై విత్తనాలు పొందడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఒకటి, రెండు రోజులు పనులు వదులుకొని మండల కేంద్రమైన ప్యాపిలికి వెళ్లి వరుసలో నిలబడాల్సి వచ్చేది. పురుగుమందులు, ఎరువులు ఇలా ప్రతి చిన్న అవసరానికి ప్యాపిలికి వెళ్లి రావాలంటే తలప్రాణం తోకకు వచ్చేది. నేడు ఆ ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. రైతుభరోసా కేంద్రం ద్వారా ఊర్లోనే సబ్సిడీపై విత్తనాలు పొందుతున్నాం. ఎరువులు, పురుగుమందులు కూడా ఆర్‌బీకేల్లోనే ఇస్తున్నారు. అన్ని రకాల సేవలు ఆర్‌బీకే ద్వారానే పొందుతున్నాం.– శ్రీపతి వెంకటేష్, రాచర్ల గ్రామం, ప్యాపిలి మండలం

రైతు ముంగిట్లోకి అన్ని రకాల సేవలు



వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించిన సేవలు ఆర్‌బీకేల ద్వారా రైతు ముంగిట్లోనే అందించే ఏర్పాటు చేశాం. సబ్సిడీతోపాటు నాన్ సబ్సిడీ విత్తనాలను కూడా అందిస్తున్నాం. కస్టమ్ హయ్యరింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఆధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చాం. ఉపాధి హామీ పథకం నిధులతో ఆర్‌బీకేలకు సొంత భవనాలు నిర్మిస్తున్నాం.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

ఆందోళన వద్దు.. అభిప్రాయ సేకరణ చేస్తాం



ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

- మల్లికార్జున రిజర్వాయర్ అంశంపై కమిటీని ఏర్పాటు చేస్తాం
- రైతులతో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ఓర్వకల్లు–మిడుతూరు మండలాల్లో మల్లికార్జున రిజర్వాయర్ నిర్మాణంపై ఆందోళన చెందొద్దని, ప్రజాభిప్రాయ సేకరణ చేస్తామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వెల్లడించారు. మల్లికార్జున రిజర్వాయర్ వద్దు, మా పొలాలు మాకు ముద్దు అన్న నినాదాలతో సోమవారం వైఎస్‌ఆర్ సెంటినరీ హాల్ ఎదుట ప్రధాన రహదారిపై గని, శకునాల, చింతలపల్లి, సున్నంపల్లి తదితర గ్రామాల రైతులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. వీరి సమస్యను నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి స్పందన కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ ఆందోళనకారుల వద్దకు వచ్చి మాట్లాడారు. దాదాపు 16టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించే మల్లికార్జున రిజర్వాయర్‌కు సంబంధించిన సర్వే పనులు ప్రాథమిక దశలోనే ఉన్నాయని చెప్పారు. నిర్మాణం ఎక్కడా అనేది ఇంకా ఖరారు కాలేదన్నారు. రిజర్వాయర్ ఏర్పాటు అంశంపై ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో త్వరలో ఒక కమిటీ ఏర్పాటు చేసి అభిప్రాయ సేకరణ చేపడతామన్నారు. తర్వాత ఆ రిపోర్టును ప్రభుత్వానికి పంపుతామని వివరించడతో రైతులు ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరమణయ్య, ఎస్సార్‌బీసీ ఈఈ శుభకుమార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

> **సీఎం దృష్టికి తీసుకెళ్లాం**
>
> జూపాడుబంగ్లా: మిడుతూరు మండలంలో మల్లికార్జున రిజర్వాయర్ నిర్మాణం విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. సోమవారం ఆయన మండ్లెం గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ మిడుతూరు మండలంలోని చౌట్కూరు, దేవనూరు, బన్నూరు, గుడిపాడు, సున్నంపల్లి గ్రామాల పరిధిలో మల్లికార్జున రిజర్వాయర్ నిర్మించి బీడు భూములకు సాగునీరు, ప్రజలకు తాగునీటినివ్వడంతో పాటు చెరువులను నింపనున్నట్లు తెలిపారు. అయితే, ఈ రిజర్వాయర్ వల్ల తమ విలువైన పంట భూములు కోల్పోవాల్సి వస్తుందని కొందరు రైతులు ఆందోళన చెందుతున్నారని, ఈ విషయాన్ని ఇటీవలే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ తర్వాతే రిజర్వాయర్ నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని సీఎం కార్యాలయం తనకు లిఖితపూర్వకంగా తెలియజేసినట్లు తెలిపారు.

మల్లన్న సేవలు @ ఆన్‌లైన్

- పారదర్శకతే లక్ష్యంగా అమలు చేస్తున్న శ్రీశైల దేవస్థానం
- భక్తులకు అందుబాటులో ఆర్జితసేవలు, స్పర్శదర్శనం టికెట్లు
- ఆన్‌లైన్ టికెట్లకు పెరుగుతున్న ఆదరణ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మల్లన్న సేవల్లో పారదర్శకత పెంచేందుకు, దళారీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపేందుకు దేవస్థానం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా దర్శనం, ఆర్జితసేవలను ఆన్‌లైన్ చేసింది. ఆయా సేవల టికెట్లను భక్తులకు ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉంచింది. రెండునెలల క్రితం శ్రీకారం చుట్టిన ఈ నూతన విధానానికి ఆదరణ పెరుగుతుంది. శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు తరలివచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతంగా స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు వీలుగా శ్రీశైల ఆలయంలో మే నెల 1వ తేదీ నుంచి అన్ని ఆర్జితసేవలు, స్వామివారి స్పర్శదర్శనం టికెట్లను పూర్తిగా ఆన్‌లైన్ చేశారు. ప్రతినెల 25వ తేదీ వచ్చేనెలకు సంబంధించిన టికెట్లను విడుదల చేస్తారు. భక్తులు తమకు కావాల్సిన రోజు ఆన్‌లైన్‌లో టికెట్లను పొంది, సేవలు నిర్వహించుకోవచ్చు. టికెట్ల లభ్యతను బట్టి ఆర్జితసేవ, స్పర్శదర్శనం సేవల నిర్వహణకు ఒక గంట సమయం ముందు వరకు కూడా టికెట్లు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశాన్ని దేవస్థానం కల్పించింది. దీంతో భక్తులు గతంలో మాదిరిగా దళారులను ఆశ్రయించకుండా నేరుగా తమకు కావాల్సిన సేవా టికెట్లను పొందుతున్నారు.

సేవ ఏదైనా ఇలా బుక్ చేసుకోవాలి..

శ్రీశైల దేవస్థానంలో ఏ సేవ చేసుకోవాలన్నా ఆన్‌లైన్‌లోనే టికెట్ తీసుకోవాలి. ముందుగా www.srisailadevasthanam.org శ్రీశైల దేవస్థానం వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయాలి. ఫోన్‌నెంబర్‌తో లాగిన్ అవ్వాలి. ప్రత్యక్ష సేవలను క్లిక్ చేయాలి. భక్తులు ఏ ఆర్జిత సేవ నిర్వహించుకోవాలనుకుంటున్నారో ఎంపిక చేసుకోవాలి. పేరు, గోత్రం, ఇతర వివరాలు నమోదు చేయాలి. ఆధార్‌కార్డును అప్‌లోడ్ చేయాలి. తరువాత ఆర్జితసేవ రుసుమును పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లించాలి. అనంతరం టికెట్ కాపీని ప్రింట్ తీసుకోవాలి. భక్తులు పొందిన ఆర్జితసేవా టికెట్ కాపీని, ఆధార్ కార్డు కాపీని క్షేత్రానికి వచ్చేటప్పుడు వెంట తీసుకురావాలి.



శ్రీశైల దేవస్థానం వెబ్‌సైట్

ఆన్‌లైన్ ద్వారా రోజుకు జారీ చేసే వివిధ సేవా టికెట్ల వివరాలు

స్వామివారి గర్భాలయ అభిషేకం	- 100టికెట్లు
సామూహిక అభిషేకం	- 750
అమ్మవారి కుంకుమార్చన	- 400
అమ్మవారి కుంకుమార్చన (ప్రాకార మండపంలో)	- 310
రుద్రహోమం	- 40
మృత్యుంజయహోమం	- 20
చండీహోమం	- 60
గణపతిహోమం (సాక్షిగణపతి ఆలయంలో)	- 25
వృద్ధమల్లికార్జున స్వామి అభిషేకం	- 350
అమ్మవారికి స్వర్ణపుష్పార్చన	- 6
నవావరణపూజ	- 6
స్వామి అమ్మవార్ల కల్యాణం	- 95
శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం	- 100
ఉమామహేశ్వరస్వామి వ్రతం	- 30
వృద్ధమల్లికార్జున స్వామికి బిల్వార్చన	- 10
గోపూజ - 150 సర్పదోశ నివారణపూజ	- 50
అన్నప్రాశన - 25 అక్షరాభ్యాసం	- 25
సహస్రదీపార్చన	- 100
మల్లికార్జున స్వామి స్పర్శదర్శనం -(వీఐపీ బ్రేక్)	- 1,575

టికెట్ల జారీలో పారదర్శకత కోసమే



టికెట్ల జారీలో పూర్తి పారదర్శకత, జవాబుదారీ తనం కోసమే ఆన్‌లైన్ ద్వారా ఆర్జిత సేవలు, స్వామివారి స్పర్శదర్శనం టికెట్లను జారీ చేస్తున్నాం. వారంలో మంగళవారం నుంచి శుక్రవారం వరకు నాలుగు రోజులు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు భక్తులకు ఉచితంగా కల్పించబడుతున్న స్వామివారి స్పర్శదర్శనం యథావిధిగా కొనసాగిస్తున్నాం. శీఘ్రదర్శనం(రూ.150), అతిశీఘ్రదర్శనం (రూ.300) టికెట్లను ఆన్‌లైన్‌తో పాటు కరెంట్ బుకింగ్ ద్వారా కూడా పొందవచ్చు. ఈ టికెట్లలో 30శాతం ఆన్‌లైన్‌లో 70శాతం కరెంట్ బుకింగ్ ద్వారా ఇస్తున్నాం.

– ఎస్.లవన్న, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

55 మంది ఎంఈఓ–2ల నియామకం

కర్నూలు సిటీ: ఉమ్మడి కర్నూలులో 55 మంది ఎంఈఓ–2లను నూతనంగా నియమించారు. ఇందు కోసం గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారు. ఈ పదోన్నతులకు విద్యాశాఖ ప్రాంతీయ కార్యాలయ అధికారి సోమవారం ఆమోదం తెలిపారు. కోడుమూరు ఎంఈఓ–1గా పనిచేస్తున్న అనంతయ్య తాను ఎంఈఓగా పని చేయలేనని, తనను హైస్కూల్ హెచ్‌ఎంగా నియమించాలని విద్యాశాఖ అధికారులకు విన్నవించారు. ఆయన విన్నపం మేరకు అమడగుంట్ల హైస్కూల్ హెచ్‌ఎంగా నియమిస్తూ ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

ఎంఈఓ–2లుగా ఎంపికైన వారి వివరాలు

వై.బాలగంగాధర్ (ఆళ్లగడ్డ), వి.సురేష్ (ఆత్మకూరు), ఎం.శ్రీనివాసులు (బనగానపల్లె), గుడిపాటి మోహన్ రెడ్డి (బండి ఆత్మకూరు), ఎస్.జనార్దన్ గౌడు(బేతంచర్ల), సయ్యద్ నయమతుల్లా (చాగలమర్రి), బి.రాజేశ్వరి (డోన్), కె.రామచంద్రయ్య (దొర్నిపాడు), ఎస్.విమల వసుంధరాదేవి(గడివేముల), ఉదయగిరి సురేంద్రనాథ్ (గోస్పాడు), పి.శ్రీనివాసులు (జూపాడుబంగ్లా), కె. వెంకటసుబ్బయ్య(కోవెలకుంట్ల), రెడ్డి అబ్దుల్ కలాం (కొలిమిగుండ్ల), ఎ.ఎల్ మహమ్మద్ ఇనాయతుల్లా (కొత్తపల్లి), బి.లింగన్న(మహానంది), కె.శ్రీనాథ్ (మిడుతూరు), కె.శ్రీనివాసులు (నందికొట్కూరు), పోతుగంటి పి.శివరాం ప్రసాద్ (నంద్యాల), వై.వెంకటేశ్వరరెడ్డి (అవుకు), మురళీమోహన్ రెడ్డి(పగిడ్యాల), అన్నెం సుభాషిణి దేవి (పాములపాడు), ఎం.సుబ్రమణ్యం (పాణ్యం), ఎస్.వెంకటేశ్వర నాయక్ (ప్యాపిలి), నాగేశ్వరలక్ష్మి (రుద్రవరం), ఎం.ఈశ్వరయ్య(సంజామల), జి.నాగార్జునరెడ్డి (శిరివెళ్ల), కె.కలీముల్లా (శ్రీశైలం), కె.వీరప్రతాప్ రెడ్డి(ఉయ్యాలవాడ), కమ్మరి నాగబ్రహ్మయ్య (వెలుగోడు).

అమృత్ పథకానికి రూ. 21.16 కోట్లు మంజూరు

నంద్యాల(సిటీ): అమృత్ పథకం కింద నంద్యాల పట్టణంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 21.16 కోట్లు మంజూరు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాలకు 34.34 కిలోమీటర్ల దూరంలోని వెలుగోడు రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకొస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులను రూ.137.34 కోట్ల అంచనాతో చేపట్టారు. ప్రస్తుతం 1.34 కిలోమీటర్ల పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో అదనంగా నిధులు మంజూరు చేసినట్లు నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు.

డిగ్రీ అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్

కర్నూలు సిటీ: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ(డాక్టర్స్ కాలనీ)లో 2023–24 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం సోమవారం నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభమైనట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ జె.హేమంత్ ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్లకు కాలేజీలో ఉచిత హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెల 26 నుంచి వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకున్న వారికి వచ్చే నెల 3న సీట్లు కేటాయిస్తారన్నారు. పూర్తి వివరాలకు 9949125567 నంబరును సంప్రదించాలన్నారు.

గుండెపోటుతో ట్రాఫిక్ ఎస్‌ఐ మృతి


ప్రేమకాంతప్ప(ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ప్రేమకాంతప్ప ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. గత రాత్రి ఇంట్లో గుండెపోటుకు గురయ్యారని.. ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. ప్రేమకాంతప్ప స్వగ్రామం ఆలూరు మండలంలోని మరకట్టు గ్రామం. సోమవారం ఉదయాన్నే మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఆయన మృతి పట్ల డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐలు పార్థసారథి, శ్రీనివాస్‌నాయక్, విక్రమసింహా, నరసింహరాజు, ఎస్‌ఐలు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

13 మంది పోలీస్ సిబ్బంది బదిలీ

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 13 మందిని బదిలీ చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. అనారోగ్యం, కుటుంబ పరిస్థితులు, స్పౌజ్ కేసులకు సంబంధించిన వినతులను పరిశీలించి అర్హులైన వారిని వారు కోరుకున్న చోటుకు బదిలీ చేశారు.

టూరిజం రెస్టారెంట్ లీజుకు 30న వేలం

కర్నూలు కల్చరల్: ఉరుకుంద వద్ద నిర్మాణ దశలో ఆగిపోయిన ఏపీ టూరిజం రెస్టారెంట్ నిర్వహణకు ఈనెల 30వ తేదీన లీజు వేలం నిర్వహిస్తున్నట్లు టూరిజం శాఖ అధికారి విజయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెస్టారెంట్‌ను 15 సంవత్సరాల కాలపరిమితితో లీజుకు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కలెక్టరేట్ ఒకటో అంతస్తులోని పర్యాటక శాఖ కార్యాలయంలో ఈనెల 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విరుచుకుపడుతున్న పులి

- పెద్దపులి దాడిలో రెండు ఆవులు మృతి

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో పెంపుడు జంతువులపై పెద్దపులి దాడులు అధికమయ్యాయి. సోమవారం ఉదయం డివిజన్ పరిధిలోని పెద్దనంతాపురం గ్రామ శివారు పంటపొలాల్లో ఆవుల మందపై పులి దాడి చేయగా రెండు ఆవులు మరణించాయి. గ్రామానికి చెందిన రైతు దరగయ్య తన ఆవుల మందను గ్రామ సమీపంలోని ఓ పొలంలో నిలిపి ఉంచాడు. సోమవారం ఉదయం ఆవులను మేపేందుకు దామెర(తలుగుల హారం) నుంచి విడిస్తున్న సందర్భంలో హఠాత్తుగా పెద్దపులి దాడిచేసింది. నోటికి అందిన ఆవుల మెడను కొరికి అడవి వైపు లాక్కెళ్లింది. కాపరి పెద్దగా అరవడంతో పులి పరారైంది. అయితే అప్పటికే రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. వీటి విలువ లక్ష రూపాయల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

వరుసగా పులిదాడులు

ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల సమీపంలో పశువులపై పెద్దపులులు దాడులు చేయడం ఇది నాలుగోసారి. ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ గ్రామ సమీపంలో రెండు సార్లు పెద్దపులి దాడి చేసి రెండు బర్రెలను బలిగొంది. వీటిలో తొలిసారి జరిగిన దాడి తరువాత అటవీ అధికారులు ఆ బర్రెను తగులబెడుతుండగా పెద్దపులి తన సహజ లక్షణానికి విరుద్ధంగా మంటల్లో కాలుతున్న జంతువును నోటకరుచుకుని లాక్కుపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. ఇదే మండలంలోని సిద్ధపల్లె గ్రామ శివార్లలో మేతకు వెళ్లిన బర్రెను కూడా పులి దాడి చేసి చంపింది. తాజాగా పెద్దనంతాపురంలో దాడి చోటు చేసుకుంది.


పులి దాడిలో చనిపోయిన ఆవు

ఆహార లభ్యత తగ్గిపోతుందా?

నల్లమలలో పులుల జీవనానికి అనుకూలత తగ్గిపోతుందా? ఇటీవల వరుసగా పెద్దపులులు గ్రామాల సమీపంలోకి వచ్చి పెంపుడు జంతువులపై దాడులకు పాల్పడడం చూస్తుంటే నిజమనే అనిపిస్తుంది. పెద్దపులి ఆహార జంతువులు తగ్గిపోతున్నాయా అనే అనుమానాలను వన్యప్రాణి ప్రేమికులు కూడా వ్యక్తం చేస్తున్నారు. నల్లమలలో క్రమేపీ పెద్దపులుల సంఖ్య పెరుగుతోందిది. తాజా లెక్కల ప్రకారం నల్లమలలో రెండేళ్ల లోపు పులి కూనలను కలుపుకుంటే సుమారు 100కు తక్కువ కాకుండా ఉన్నాయి. ఒక్కో పెద్దపులి తన బలాన్ని ఆసరాగా చేసుకుని సుమారు 40 చ.కిమీ పరిధిని తన సామ్రాజ్యంగా చేసుకుంటుంది. మరో పులిని ఆ ప్రాంతంలో సంచరించనీయదు. ఇలా పులులు తమ పరిధిని ఏర్పాటు చేసుకుంటూ పోతే పోటీకి నిలవలేని కొన్ని పులులు అనివార్యంగా సులభంగా లభించే పెంపుడు జంతువులైన బర్రెలు, ఆవులు, గొర్రెలపై దాడులకు తెగబడుతున్నట్లు తాజా ఘటనలను బట్టి తెలుస్తోంది.

వేటగాళ్లను అదుపు చేయలేని అటవీ శాఖ

నల్లమలలో పులి ఆహార జంతువులైన పొడ దుప్పులు, అడవి పందులు, కణుతులు, ఇతర జంతువులకు కొదవ లేదు. అయితే ఇటీవల నల్లమలలో వేటగాళ్ల చొరబాటు అధికమైంది. విచక్షణా రహిత వేటలో దుప్పులు, అడవి పందులు బలై పట్టణాలలోని వంట గదులకు చేరుతున్నాయి. అప్పుడప్పుడు అటవీ శాఖ చేస్తున్న అడపాదడప దాడులలో కొందరిని అరెస్టు చేసినా ఎవరికీ పెద్దగా శిక్షలు పడుతున్న దాఖలాల్లేవు. నాటు తుపాకులు విరివిగా వాడుతున్నా పోలీసు శాఖ కూడా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. విచ్చలవిడి వేట కారణంగా ఆహార జంతువుల లభ్యత తగ్గి పెద్దపులి గ్రామాల్లోకి వస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

సర్వ నరసింహస్వామికి హోంగార్డు ఎస్పీ పూజలు


ఆలయం వద్ద ఎస్పీ

శిరివెళ్ల: ఉమ్మడి జిల్లా హోం గార్డు ఎస్పీ మహేష్ కుమార్ సోమవారం నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ సర్వ నరసింహస్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ చైర్మన్ రేవనూరు రామాంజనేయరెడ్డి, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ స్వామికి ప్రత్యేక పూజలు చేసి ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు.

భారీగా సోయాబీన్ విత్తనాలు సీజ్


సోయాబీన్ విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ, పోలీసులు

వెలుగోడు: మండల కేంద్రం వెలుగోడులోని కోరమండల ఇంటర్నేషనల్ మన గ్రోమోర్ సెంటర్‌కు సంబంధించిన సోయాబీన్ విత్తనాలను అధికారులు సీజ్ చేశారు. మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమతి లేని గోదాంలో మన గ్రోమోర్ సెంటర్ వారు రూ. 6,83,000 విలువ చేసే సోయాబీన్ విత్తనాలు నిల్వ ఉంచారు. అధికారులు గుర్తించి వాటి అమ్మకాలను నిలుపుదల చేశారు. అనంతరం అబ్దుల్లాపురం రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి మట్టి నమూనా సేకరణ త్వరగా పూర్తిచేయాలని సిబ్బందికి ఆదేశించారు.

నల్లమల ఘాట్‌లో తప్పిన పెను ప్రమాదం

- బ్రేక్ ఫెయిలై రెండు కార్లను ఢీకొన్న లారీ
- ప్రాణాలతో బయటపడిన ప్రయాణికులు

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులో బ్రేకులు ఫెయిలై ఓ లారీ రెండు కార్లను ఢీకొంది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు...నంద్యాలకు చెందిన సునందలక్ష్మి, ఆమె బంధువులు స్కార్పియోలో విజయవాడకు వెళ్తున్నారు. గిద్దలూరు నుంచి జొన్నల లోడుతో వస్తున్న ఓ లారీకి ఘాట్‌రోడ్డులోని పాతబొగద వంతెన వద్ద బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో అదుపు తప్పి ముందు వెళ్తున్న స్కార్పియోతో పాటు ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొంది. ఈ ఘటనలో నంద్యాలకు చెందిన షేక్ హుసేన్‌బాష, కుటుంబ సభ్యులు వెళ్తున్న కారుతో పాటు స్కార్పియో దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


దెబ్బతిన్న స్కార్పియో

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూసిటీ): అనుమతి లేకుండా ఎవరైనా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రెండు రోజుల క్రితం దేవమాడలో ట్రాక్టర్లతో అక్రమంగా మట్టిని తరలిస్తుండడంతో తనిఖీ చేసి కేసు నమోదు చేశామన్నారు. అలాగే సోమవారం నూతనపల్లెలో లైసెన్స్ లేకుండా ఎర్ర మట్టిని ట్రాక్టర్లలో తరలిస్తుండడంతో తనిఖీ చేసి నోటీసు జారీ చేశామని చెప్పారు. జిల్లాలో 200 క్వారీలు ఉన్నాయని, 75 నుంచి వంద గనులకు అనుమతులు ఉన్నాయని తెలిపారు. ఎవరైనా మట్టి తీసుకెళ్లాలంటే అనుమతులు ఉండాలని పేర్కొన్నారు.



వేగవంతమైన సీసీఆర్‌సీ కార్డుల జారీ

కర్నూలు(అగ్రికల్చర్): కౌలుదారులకు పంటసాగు హక్కుపత్రం(సీసీఆర్‌సీ) జారీ కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం వేగవంతం చేసింది. సీసీఆర్‌సీ కార్డులు పొందిన సాగుదారులకు వైఎస్‌ఆర్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయంతో పాటు అన్ని రకాల ప్రయోజనాలు లభిస్తాయి. జిల్లాలో 2023–24 సంవత్సరానికి 7,350 సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ లక్ష్యాన్ని నిర్దేశించారు. కొన్ని మండలాల్లో కార్డుల జారీ లక్ష్యం ఎక్కువగా ఉండటం, కొన్ని మండలాల్లో తక్కువగా ఉండటంతో అన్ని మండలాలకు ఒకేలా లక్ష్యాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సృజన వ్యవసాయశాఖను ఆదేశించారు. ఆ మేరకు లక్ష్యాలను సవరిస్తూ జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాగుదారులకు 10 వేల సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలని ఏవో, ఏడీఏలను ఆదేశించారు. జిల్లాలో 3,52,564 మంది పట్టాదారులు ఉండగా.. ఇప్పటి వరకు సాగుదారులకు 3,035 సీసీఆర్‌సీ కార్డులు జారీ చేశారు. తాజా ఆదేశాల మేరకు అత్యధికంగా ఆదోనిలో 1,200, కల్లూరులో 1,100, కర్నూలు మండలంలో 1,000 సీసీఆర్‌సీ కార్డులు జారీకి లక్ష్యం నిర్దేశించారు. ఓర్వకల్లు మండలంలో 845, కోడుమూరు, కొత్తాళం మండలాల్లో 600 ప్రకారం సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాల్సి ఉంది.

పట్టపగలే సినీ ఫక్కీలో చోరీ

- 80 తులాల బంగారు ఆభరణాలు, రూ.3లక్షల నగదు ఉండే బ్యాగ్ అపహరణ

ఎమ్మిగనూరు రూరల్: పట్టపగలే పట్టణ నడిబొడ్డున దొంగలు చాకచక్యంగా బంగారు దుకాణంలోని ఆభరణాలు, నగదు ఉండే బ్యాగ్‌ను అపహరించుకుపోయారు. సోమవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో జరిగిన చోరీ ఎమ్మిగనూరులో కలకలం రేపింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని వెంకటాపురం కాలనీలో నివాసముంటున్న రఘువీర రోజు మాదిరిగా ఉదయం బంగారు దుకాణానికి వచ్చాడు. దుకాణాన్ని తెరచి తనతో పాటు తెచ్చిన బ్యాగ్‌ను లోపల ఉంచాడు. బ్యాగ్‌లో 80 తులాల బంగారు ఆభరణాలు, రూ. 3 లక్షల నగదు, సెల్ ఫోన్ ఉన్నట్లు రఘువీర చెబుతున్నాడు. బ్యాగ్‌ను దుకాణంలో ఉంచి తెలిసిన వృద్ధుడిని చూస్తూ ఉండాలని, దర్గాకు మొక్కు తీర్చుకునేందుకు వెళ్లాడు. దుకాణం దగ్గరకు ముగ్గురు యువకులు వచ్చి ఇద్దరు బయట నిల్చోగా ఒకడు లోపలికి వెళ్లి వృద్ధుడితో 'నీది ఒక చెప్పు దూరంగా పడివుంది' అని చెప్పటంతో ముసలాయన బయట వెళ్లాడు. చెప్పు దూరంగా పడివుండటంతో తెచ్చుకోవటానికి వెళ్లటంతో ఇదే అదునుగా భావించిన దొంగలు బ్యాగ్‌తో పరార్ అయ్యారు. దర్గాకు వెళ్లి వచ్చిన యజమానికి ఇక్కడ బ్యాగ్ ఉండాలి కదా అని వృద్ధుడిని ప్రశ్నించగా తాను చెప్పు తెచ్చుకోవటానికి వెళ్లానని, ఇక్కడ ఎవరో ముగ్గురు యువకులు ఉన్నారని సమాధానం ఇచ్చాడు. ఇది దొంగల పని అని తెలుసుకొని తన షాప్‌లో ఉన్న సీసీ ఫుటేజ్‌ను చూడగా ఒక యువకుడు షాప్‌లోపలకి వచ్చి బ్యాగ్ తీసుకెళ్లిన దృశ్యాలు కనిపించాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ మధుసూదన్‌రావు, ఎస్‌ఐ మస్తాన్‌వలి అక్కడికి చేరుకున్నారు. చోరీకి ముందు దొంగలు పక్కాగా రెక్కీ నిర్వహించినట్లు తెలుసుకున్నారు. చోరీకి గురైన బ్యాగ్‌లో రఘువీర సెల్‌ఫోన్ ఉండటంతో పోలీసులు లోకేషన్‌ను పరిశీలించారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే దొంగలు సెల్‌ను కోసిగి రోడ్డ్ పెట్రోల్ బంక్ సమీపంలో పడేసివెళ్లినట్లు గుర్తించి దాని కోసం వెతుకుతున్నారు. చోరీకి గురైన బంగారు ఆభరణాలు విలువ రూ. 48 లక్షలు ఉంటుంది. గతంలో ఇదే దుకాణంలో దొంగలు చోరీకి యత్నించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ మధుసూదన్‌రావు తెలిపారు.


చోరీ జరిగిన షాప్‌లో యజమాని రఘువీర


సీసీ కెమెరాలో దొంగ ఫుటేజ్

ఆటో డ్రైవర్ అనుమానాస్పద మృతి


మృతుడు బోయ సూరి(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని న్యూ ఉప్పర కాలనీలో ఓ ఆటో డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ విషయం ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..పట్టణంలోని ఎల్లమ్మబీడు కాలనీలో నివాసం ఉండే బోయ సూరి(30) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల కిత్రం తెలిసిన వ్యక్తి ఫోన్ చేస్తే తాను బయటకు వెళ్లివస్తా అని చెప్పి సెల్‌ఫోన్ ఇంట్లో పెట్టి వెళ్లాడు. భర్త ఇంటికి రాకపోవడంతో భార్య భూలక్ష్మి తెలిసిన వారందరినీ విచారించినా ప్రయోజనం లేకపోయింది. అయితే సోమవారం న్యూ ఉప్పర కాలనీలో నిర్మాణంలో ఉన్న రేకుల గుడిసె నుంచి దుర్వాసన వస్తుండటంతో కాలనీ వాసులు వెళ్లి చూడగా బోయ సూరి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గమనించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తన భర్త ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ మదుసుధన్ రావు తెలిపారు.

రాత్రంతా ముళ్ల పొదల్లోనే..

- భయంతో వణికిపోతున్న బాలుడు
- మత్తుమందు కలిపిన బిస్కెట్ ఇచ్చి కిడ్నాప్ చేసిన వైనం
- ఎమ్మిగనూరు పట్టణంలో ఘటన

ఎమ్మిగనూరురూరల్: ఆలనాపాలనా చూసుకోవాల్సిన తల్లి వదిలేసి వెళ్లింది.. సంరక్షకుడిగా ఉన్న తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు.. చిన్నమ్మ వద్ద ఉంటున్న బాలుడికి పెద్ద కష్టమొచ్చింది. గుర్తు తెలియని వ్యక్తి బిస్కెట్‌లో మత్తు మందు ఇచ్చి కిడ్నాప్ చేశాడు. అనంతరం బాలుడిని ముళ్లపొదల్లో వదిలేశాడు. రాత్రంతా బాలుడు అక్కడే ఉన్నాడు. ఉదయం మెలకువ వచ్చిన తర్వాత తాను ఉన్న ప్రాంతాన్ని చూసి భయంతో వణికిపోయాడు. ఈ ఘటన ఎమ్మిగనూరు పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు.. స్థానిక శివన్న నగర్‌లో బాలుడు నరేష్(12) తన చిన్నమ్మ వీరేశమ్మ దగ్గర ఉంటున్నాడు. మనస్పర్ధలు రావటంతో బాలుడి తండ్రి వీరేష్, తల్లి సరోజమ్మలు ఐదు సంవత్సరాల క్రితం విడిపోయారు. తండ్రి వీరేష్ వద్ద బాలుడిని వదిలేసి తల్లి తన పుట్టినిల్లు అయిన గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడుకు వెళ్లిపోయింది. వీరేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో బాలుడు నరేష్ తన చిన్నమ్మ వీరేశమ్మ దగ్గర ఉంటున్నాడు. స్థానిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం అమావాస్య కావడంతో టెంకాయ తీసుకురావడానికి వెళ్లి ఎంతకూ తిరిగి రాలేదు. దీంతో బాలుడి మేనత్త భాగ్య, చిన్నమ్మ వీరేశమ్మ వెతికినా ఎక్కడా కనిపించకపోవటంతో రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం బాలుడి మేనత్త శివన్న నగర్‌లోని బంక్ పరిసర ప్రాంతంలో వెతుకుతుండగా ముళ్లపొదల పక్కన బాలుడు పడుకుని ఉండటం గమనించింది. ముఖంపై నీళ్లుచల్లి.. ఏమి జరిగిందని నరేష్‌ను విచారించగా.. టోపీ పెట్టుకున్నవ్యక్తి వచ్చి తనకు బిస్కెట్ ఇచ్చాడని, మత్తురావటంతో ఆ వ్యక్తి తనను తీసుకెళ్లినట్లు చెప్పాడు. బాలుడిని తీసుకెళ్లిన వ్యక్తి మత్తు బిస్కెట్ ఎందుకు ఇచ్చాడు, తీసుకెళ్లి ముళ్లపొదల్లో ఎందుకు పడేశాడు అనేది తెలియరాలేదు. బాలుడు భయంతో వణికిపోతున్నాడు. ముళ్లు శరీరంపై గుచ్చుకున్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. నరేష్‌ను మేనత్త భాగ్య సోమప్ప నగర్‌లో తన ఇంటికి తీసుకొచ్చింది. పట్టణంలో పిల్లలను ఎత్తుకెళ్లే వ్యక్తులు సంచరిస్తున్నారనే వదంతులతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.


బాలుడు నరేష్

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయ పద్ధతులతోనే నాణ్యమైన దిగుబడులు సాధ్యమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కర్నూలు శివారులోని దిన్నెదేవరపాడు గ్రామ పొలాల్లో ప్రకృతి వ్యవసాయంపై పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీపీఎం మాట్లాడుతూ విత్తనం వేసినప్పటి నుంచి పంట కాలం పూర్తయ్యే వరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి ఆరోగ్యకరమైన పంటలు పండించాలని సూచించారు. ఒక పొలంలో ఒకే పంట సాగు చేయడం మంచిది కాదని, ప్రధాన పంటతో పాటు పలు రకాల అంతర పంటలు కూడా సాగు చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల ప్రధాన పంట దెబ్బతిన్నా.. మిగిలిన అంతర పంటలు ఆదుకుంటాయన్నారు. చీడపీడల నివారణకు కషాయాలు, అగ్నిఅస్త్రం, బ్రహ్మాస్త్రం తదితరాలను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సందీప్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

శక్తివంతంగా ఆర్యవైశ్య మహాసభ


ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు

కర్నూలు(అర్బన్): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ మరింత శక్తివంతంగా ఎదుగుతోందని రాజ్యసభ మాజీ సభ్యులు, గ్లోబల్ చైర్మన్ టీజీ వెంకటేష్ అన్నారు. సోమవారం స్థానిక మౌర్యాఇన్‌లో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. మహాసభ జిల్లా అధ్యక్షులు నాగేళ్ల రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షులు టంగుటూరు రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్త ఆర్యవైశ్యులను ఏకం చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి రోశయ్య ప్రపంచ ఆర్యవైశ్య మహాసభను స్థాపించారన్నారు. ఆర్యవైశ్యులందరినీ బలోపేతం చేయడంతో పాటు వారి గౌరవాన్ని పెంపొందించేలా మహాసభ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ నార్త్ విభాగం అధ్యక్షులుగా కోన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నరసింహరావుతో కూడిన నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు రాజగోపాల్, జాతీయ కోఆర్డినేటర్ ఇల్లూరు లక్ష్మయ్య, వాసవి సత్రాల సముదాయం అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు, మహిళా విభాగం ప్రతినిధులు జ్ఞానేశ్వరమ్మ, రాజ్యలక్ష్మి, పద్మజ, ఉమాదేవి పాల్గొన్నారు.